


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 12-04-2026 సంపుటి : 07 సంచిక 313 పేజీలు : 8 వెల : రూ 3-00


# మహిళలు, బాలికలపై దాడులు చేస్తే చర్యలు తప్పవు: సీఎం చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 11: కడప జిల్లాలో జరిగిన దారుణ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై దాడులకు తెగబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి విషయాల్లో నిందితులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. ఖాజీపేట ప్రాంతంలో బాలికపై జరిగిన అమానుష దాడి, హత్య ఘటనపై సీఎం సీరియస్ అయ్యారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆడబిడ్డల భద్రత విషయం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.కడప జిల్లా ఖాజీపేటలో రామకీర్తనను(17) వెంకటేశ్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. కొంత కాలంగా ప్రేమించాలంటూ బాలికను వేధింపులకు గురిచేశాడు వెంకటేష్. అందుకు బాలిక నిరాకరించడంతో కోపంతో ఊగిపోయిన ప్రేమోన్మాది.. నిన్న(శుక్రవారం) బాలిక ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె ఒంటిరిగా ఉంది. దీంతో తనను ప్రేమించాలని బలవంతం చేశాడు వెంకటేశ్. అందుకు కీర్తన నిరాకరించడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో బాలిక గొంతు కోశాడు ఉన్మాది. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి వచ్చి చూడగా కూతురు రక్తపుమడుగులో పడి ఉంది. దీంతో హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలిక చనిపోయింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ కానున్న మంత్రి లోకేశ్..



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి ఇటీవల పూర్తి చట్టబద్ధత లభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్రతో అమరావతి రైతులు, ఏపీ ప్రజల కల నెరవేరింది. రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపాలని కూటమి నేతలు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రాష్ట్రపతిని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు కలవనున్నారు. సోమవారం నాడు ఢిల్లీకి వెళ్లి రాష్ట్రపతి ముర్ముతో భేటీ కానున్నారు. రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ ఆమోదం తెలపడంపై ఏపీ ప్రజల తరఫున కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ఆమెకు అమరావతి విశిష్టతలు తెలియజేసే బుక్ లెట్‌ను అందజేయనున్నారు.ఇటీవల జరిగిన ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధాని అమరావతే అంటూ సభ్యులు తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని పార్లమెంట్ ఉభయ సభలకు రాష్ట్ర ప్రభుత్వం పంపింది. అనంతరం లోక్ సభలో ఏప్రిల్ 1న బిల్లు చర్చకు రాగా దాదాపు అన్నీ పార్టీలు మద్దతు తెలిపాయి. మరుసటి రోజున రాజ్యసభకు బిల్లు వెళ్లగా అక్కడా గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. ఏప్రిల్ 6న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దీన్ని పరిశీలించి ఆమోదించారు. అదే రోజు రాత్రి 10 గంటల కల్లా గెజిట్ నోటిఫికేషన్ సైతం వెలువడింది. ఏపీ పునర్వవస్థీకరణ చట్టం సబ్ సెక్షన్-2లో రాజధానిగా అమరావతిని పేర్కొంటూ కేంద్ర న్యాయ శాఖ గెజిట్ విడుదల చేసింది. దీంతో అమరావతి శాశ్వత రాజధానిగా కేంద్రస్థాయిలో చట్టబద్ధ రక్షణ లభించింది.

# 111 మంది రైతులకు డీ-నోటిఫై పత్రాలు పంపిణీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 11: జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న చుక్కల భూములు, 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్యలకు పరిష్కారం కల్పిస్తూ 111 మంది రైతులకు డీ-నోటిఫై క్లియరెన్స్ పత్రాలను జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి శనివారం కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓలు, తహసీల్దార్‌లు, రైతులు పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ 'మీ భూమి ? మీ హక్కు' లక్ష్యంతో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. గ్రీవెన్స్‌లో ఎక్కువగా భూ సంబంధిత ఫిర్యాదులే వస్తున్నాయని, చట్టబద్ధమైన పత్రాలు, భూమిపై ఆధారాల మేరకు నిజమైన హక్కుదారుల పేర్లు నమోదు చేస్తున్నామని తెలిపారు.2017లో అమల్లోకి వచ్చిన డాటెడ్ ల్యాండ్స్ చట్టం ప్రకారం అర్హులకు పట్టాదారు హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 150 కేసుల్లో 111 పరిష్కరించామని, మిగిలినవీ త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. డీ-నోటిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని, డబ్బులు అడిగితే పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.కార్యక్రమం అనంతరం 111 మంది రైతులకు డీ-నోటిఫై పత్రాలు అందజేశారు.

# చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగింది: అనిత

విశాఖపట్నం, ఏప్రిల్ 11 : చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ అంటే ఒక గౌరవమని ఉద్ఘాటించారు. పోక్సో కేసుల్లో బెయిల్ రాకుండానే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ సమన్వయంతో పని చేస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ప్రాసిక్యూషన్ విభాగం ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, బానిస కార్మిక వ్యవస్థ (రద్దు) చట్టం, 1976పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హోంమంత్రి అనిత, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ రామకోటేశ్వరరావు, 200 మంది ప్రాసిక్యూషన్ అధికారులు పాల్గొన్నారు. వివిధ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను సత్కరించారు. అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడేది ఈ వర్క్‌షాప్ అని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా 900 మంది పిల్లలను రక్షించామని వివరించారు. వివిధ దేశాల్లో చిక్కుకున్న180 మందిని కూడా రక్షించామని తెలిపారు. పోలీస్ శాఖలో కూడా నూతన టెక్నాలజీతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పోలీస్ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ పటిష్ఠంగా ఉంటేనే.. ప్రజాస్వామ్యం పటిష్ఠంగా ఉంటుందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.



# బిజెపి అధికారంలోకి వస్తే మహిళల భద్రతకు పూర్తి భరోసా..



కోల్‌కతా: బెంగాల్‌ను తృణమూల్ కాంగ్రెస్ (ంఓఅ) నాశనం చేసిందని ప్రధాని మోడీ ఫైరయ్యారు. బెంగాల్ లో రాజకీయ హింస, చొరబాటుదారులపై చర్యలు తీసుకుంటామని ప్రధాని చెప్పారు. ఈ నెల 23, 29 తేదీల్లో బెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. శనివారం పూర్బా బర్ధమాన్‌లో మొదటి బహిరంగ సభలో మోడీ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ (ఃఏఖ)కి లభిస్తున్న మద్దతు కారణంగా తృణమూల్ కాంగ్రెస్ 'భయాందోళన'లో ఉందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళల భద్రతకు పూర్తి భరోసా లభిస్తుందని, రాజకీయ హింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. తన ఆత్మను చంపుకొని కెసిఆర్‌ను కౌగిలించుకున్నాడు.. పశ్చిమ బెంగాల్ నుండి అక్రమ చొరబాటుదారులందరినీ బహిష్కరిస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చారు. అక్రమ చొరబాటుదారులకు మద్దతు ఇచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ చొరబాట్లకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. మరిన్ని కనుగొనండి బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ ఎడిటోరియల్ విశ్లేషణ కెరీర్ కౌన్సెలింగ్ సేవలు "అవినీతి, శాంతిభద్రతలకు సంబంధించి బీజేపీ ఒక 'శ్వేతపత్రం' విడుదల చేస్తుంది. తద్వారా ప్రతి ంఓఅ గూండా, సిండికేట్ సభ్యుడు, అవినీతి ఎమ్మెల్యే, మంత్రి చట్టం ముందు పూర్తి బాధ్యత వహించేలా చేయవచ్చు" అని మోడీ అన్నారు. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, సుప్రీం కోర్టు పదవీ విరమణ పొందిన న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను బీజేపీ నిలిపివేయదని, కేవలం ంఓఅ అవినీతిని, దోపిడీని మాత్రమే అంతం చేస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే జరిగే మొదటి మంత్రివర్గ సమావేశంలోనే, పశ్చిమ బెంగాల్‌లో 'ఆయుష్మాన్ భారత్' ఆరోగ్య పథకాన్ని బిజెపి అమలు చేస్తుందని ప్రధాని చెప్పారు.

# ఎన్టీఆర్ జిల్లా కీసర టోల్ ప్లాజా వద్ద ఘోర ప్రమాదం..

ఎన్టీఆర్ జిల్లా: కంచికచర్ల మండలం కీసర టోల్ గేట్ వద్ద ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. బీఎండబ్ల్యూ కారుపై సిమెంట్ ప్లయాస్ లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు.. టోల్ కట్టేందుకు ప్లాజా వద్ద ఆగింది. వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి దానిపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఏపీ, తెలంగాణ హైకోర్టుల సీనియర్ న్యాయవాది బొద్దులూరి శ్రీనివాసరావు మృతిచెందారు.ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన టోల్ గేట్ సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మూడు జేసీబీల సహాయంతో అతి కష్టంగా మీద లారీని పైకి లేపారు. ప్రమాద సమయంలో కారులో శ్రీనివాసరావు ఒక్కరే ఉన్నారని, ఆయనే డ్రైవ్ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదంతో విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది.




# సంపాదకీయం

ఆదివారం 12-04-2026

## అన్ని రంగాలపై యుద్ధప్రభావం

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు కేవలం భౌగోళిక రాజకీయాలకే పరిమితం కాలేదు.అవి గ్లోబల్ సప్లై చైన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. యుద్ధం అనేది మానవ సమాజానికి అత్యంత ప్రమాదకరం. చరిత్రలో జరిగిన ప్రపంచ యుద్ధాలు అపార నష్టాన్ని మిగిల్చాయి. యుద్ధం వల్ల కేవలం రెండు దేశాలకే కాదు, మొత్తం ప్రపంచానికే కోలుకోలేని నష్టం జరిగి ఆర్థిక సంక్షోభంలోకి అనివార్యంగా నెట్టబడతాయి. యుద్ధం వల్ల జరిగే ప్రధాన నష్టం ప్రాణనష్టం. లక్షలాది మంది సైనికులు, సాధారణ ప్రజలు తమ ప్రాణాలను కోల్పోతారు. అనేక కుటుంబాలు తమ బంధువులను కోల్పోయి దుఃఖంలో మునిగిపోతాయి. రెండోది ఆర్థిక నష్టం. యుద్ధం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. పరిశ్రమలు, వ్యవసాయం నిలిచిపోతాయి. ప్రభుత్వాలు రక్షణ ఖర్చుల కోసం భారీగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తుంది.మూడవది మౌలిక సదుపాయాల నష్టం. యుద్ధ సమయంలో రహదారులు, వంతెనలు, భవనాలు ధ్వంసమవుతాయి. విద్యుత్, నీటి సరఫరా వంటి అవసరమైన సేవలు నిలిచిపోతాయి. నాలుగోది శరణార్థుల సమస్య. యుద్ధం కారణంగా ప్రజలు తమ ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా ఇరాన్?లో ఇప్పటికే ప్రజలు సంక్షోభంలో బతుకుతున్నారు.ప్రపంచ చమురు వాణిజ్యంలో 20 శాతం, భారతదేశ ముడి చమురు దిగుమతుల్లో 50 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధి ప్రస్తుతం ఒ ప్రమాదకరమైన మలుపులో ఉంది. జల సంధి అధికారికంగా మూసివేయకపోయినా అక్కడ పెరిగిన ఇన్సూరెన్స్ రేట్లు, దాడులకు భయంతో షిప్పింగ్ కార్యాకలాపాలు స్తంభించిపోయాయి. దాదాపు 4500 భారతీయ ఎగుమతిదారులు, 1800 మంది దిగుమతిదారులు ఈ మార్గంపై ఆధారపడి ఉన్నారు. షిప్పింగ్ కంపెనీలు ఇప్పుడు వార్ రిస్క్ సర్ఛార్జ్, ఎమర్జెన్సీ ఫ్యూయల్ సర్ఛార్జ్ వంటి కొత్త పన్నులను విధిస్తున్నాయి. దీని వల్ల కంటైనర్ రవాణా ఖర్చు ఏకంగా రెండు వేల నుంచి మూడు వేల డాలర్ల వరకు పెరిగింది షిప్పింగ్ ఆలస్యం వల్ల వస్తువులు చేరడానికి పట్టే సమయంలో మరో పది నుంచి ఇరవై రోజులు పెరుగుతోంది. ఆసియాలోనే అతి పెద్ద ఆటోమొబైల్ విడిభాగాల మార్కెట్ అయిన ఢిల్లీలోని కశ్మీర్ గేట్‌లోని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ముడి చమురు ధరలు పెరగడం వల్ల ప్లాస్టిక్, రబ్బర్, ప్యాకేజింగ్ మెటీరియల్స్ ధరలు పెరిగాయి. మార్కెట్ నిపుణుల ప్రకారం విడిభాగాల తయారీ ఖర్చు 25 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగింది. మరోవైపు ఇంధన ధరల పెరుగుదల వల్ల ఫ్యాక్టరీల్లో కార్మికులు స్వగ్రామాలకు తరలిపోతుండటంతో ఉత్పత్తి కుంటుపడింది. రబ్బర్ విడిభాగాల తయారీ ఖర్చు పది నుంచి 16 రూపాయలకి పెరగగా, ముడి చమురు ధరల పెరుగుదల వల్ల ప్లాస్టిక్ వస్తువుల ధరలు రెట్టింపు అవుతున్నాయి. దీనికి తోడు హుర్ముజ్ జలసంధి వద్ద సుమారు 2,300 పెట్రోలియం కంటైనర్లు నిలిచిపోవడం వల్ల సప్లై పూర్తిగా దెబ్బతింది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి తయారీదారులు ధరలను పెంచడం అనివార్యమని ప్రకటించారు. ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల కార్లు, టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు ఐదు శాతం నుంచి ఆరు శాతం వరకు పెరగనున్నాయి. మెర్సిడెస్ బెంజ్, ఆడి వంటి సంస్థలు ఇప్పటికే రెండు శాతం ధరల పెంపును ప్రకటించాయి. షూస్, ప్లాస్టిక్ ఆధారిత దుస్తుల ధరల 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది.వాహన తయారీ సంస్థలు పాండమిక్ సమయంలో చేసినట్టుగానే క్రైసిస్ మేనేజ్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. అల్యూమినియం, కాపర్, ఎలక్ట్రానిక్ విడిభాగాల కోసం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే మార్గాలను అన్వేషిస్తున్నాయి. అయినప్పటికీ భారత్ విడిభాగాలు దిగుమతుల్లో చైనా వాటా 30 శాతంగా ఉంది. జర్మనీ, దక్షిణ కొరియా నుంచి కూడా దిగుమతులు పెరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల నియంత్రణ అనేది తయారీదార్లకు ఒక సవాల్‌గా మారింది. నేటి పరిస్థితులు చూస్తుంటే 1970 నాటి అంతర్జాతీయ సంక్షోభాన్ని గుర్తు తెస్తుందని నిపుణులు చెబుతున్నారు. కేవలం చమురు మాత్రమే కాదు, టైల్స్, పేపర్, పెట్రోకెమికల్ ఉత్పత్తులపై ఆధారపడిన పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.పశ్చిమాసియాలో జరుగుతున్న ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం గత నెల రోజులుగా తీవ్రస్థాయిలో కొనసాగుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. యుద్ధంపై అమెరికా ఇప్పటికే 27 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. యుద్ధానికి ప్రతి సెకనుకు 10,300 వేల డాలర్స్ ఖర్చు అవుతున్నాయి, ఆయుధాలకు, 320మిలియన్, విమానాలకు 245 మిలియన్, నేవీకి 155 మిలియన్, రక్షణ వ్యవస్థకు 95 మిలియన్ డాలర్లు, దీనివలన భవిష్యత్ లో అమెరికా ఎదుర్కొనే సంక్షోభం గ్రహించి అమెరికా చరిత్రలో తొలిసారి 50 రాష్ట్రాలలో 'నో కింగ్ నో వార్' నినాదంతో లక్షలాది ప్రజలు నిరసన వ్యక్తం చేశారు, ఇరాన్, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలు యుద్ధం ముగియాలని కోరుకుంటున్నాయి. కానీ అమెరికా అవలంబిస్తున్న విధానాల వలన యుద్ధం ఇప్పట్లో ముగిసే అవకాశాలు కనిపించడం లేదు.హార్ముజ్? జలసంధి తెరిచేందుకు ప్రయత్నిస్తే ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయి. నాటో కూటమిని ట్రంప్ మద్దతు కోరినా సానుకూల స్పందన లేదు. దీనితో అమెరికా దిక్కు తోచని పరిస్థితుల్లో కూరుకుపోయిందని అర్థమవుతోంది. ఇరాన్, ఇజ్రాయెల్ ఇతర గల్ఫ్ దేశాలు అనేక రకాల నష్టాలు ఎదుర్కొంటున్నాయి.

## బీసీ ఉప కోటా కోసం కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా ఉద్యమం-కవిత

హైదరాబాద్,మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, జాగృతి నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ పూలే మళ్లీ పుట్టాడా అనే స్థాయిలో జాగృతి బీసీల కోసం పని చేస్తుంది. మహిళ రిజర్వేషన్ల బిల్లులో బీసీ ఉపకోటా లేకపోవటమంటే పాలకులకు భయం లేనట్లే. బీసీ ఉప కోటా కోసం కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా ఉద్యమం చేద్దామని అన్నారు.బీసీ ఉపకోటా వచ్చే వరకు కూడా జాగృతి పోరాటం కొనసాగిస్తుంది. మహాత్మా పూలే విగ్రహ ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది . ఆయన ఆశయాలను సాధించేలా పోరాటం చేయటమే నిజమైన నివాళి. చట్టసభల్లో మహిళా కోటాలో బీసీ మహిళలకు ఉప కోటా కోసం పూలే మళ్లీ పుట్టారా అన్నట్లుగా కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా తెలంగాణ జాగృతి ఉద్యమిస్తుంది. ఈ నెల 16, 17, 18 న మహిళ బిల్లుపై పార్లమెంట్ లో చర్చ జరగనుంది. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి అన్ని పార్టీల వారితో ఈ అంశంపై మాట్లాడుతా. అధికారం, ఎంపీల బలం ఉందని ఇప్పుడు బిల్లు పాస్ చేసుకుంటే చూస్తూ ఊరుకోం. బీసీ మహిళలకు ఉపకోటా వచ్చే వరకు పోరాటం చేస్తాం. పూలే విగ్రహాన్ని ఆయన జయంతి రోజు వరకు పూర్తి చేయాలని మనం ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చాం. కానీ ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇప్పటికీ కూడా విగ్రహం ఏర్పాటు చేయలేదు. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని కోరితే ట్యాంక్ బండ్ వద్ద పెడతామని చెప్పారు. ఇది పాక్షిక విజయమే అయిన సరే ట్యాంక్ బండ్ వద్ద పూలే గారి విగ్రహం పెట్టాలని కోరామని అన్నారు.కానీ ఇప్పటి వరకు కూడా విగ్రహాన్ని పూర్తి చేయలేదు. అంబేద్కర్ జయంతి నాటికైనా పూలే విగ్రహాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నా. మహాత్మా జ్యోతిరావు పూలే ఎన్ని కష్టాలు వచ్చిన సరే వెన్ను చూపకుండా పోరాడిన త్యాగధనులు. ఏ విప్లవం వచ్చిన సరే త్యాగం పునాదిగా ఉంటుంది. సమాజంలో మార్పు తేవాలంటే ముందు ఆ మార్పు మన నుంచే మొదలుకావాలి. మనం చేపట్టే బాట కూడా ముళ్లబాట మాదిరిగానే ఉంటుంది. ముందు మనల్ని ఒప్పుకోరు. పూలే కి కూడా అదే జరిగింది. ఎన్ని అవమానాలు ఎదురైన సరే ఆయన నమ్ముకున్న తోవను వదలిపెట్టలేదు. అందుకే ఇన్నేళ్ల తర్వాత కూడా ఆయనను మనం గుర్తు చేసుకుంటున్నాం. పూలే కి నిజమైన నివాళి అంటే ఆయన చెప్పిన సామాజిక న్యాయం కోసం అహర్నిశలు పనిచేయటమేనని అన్నారు.



## నెతన్యహూ పదేపదే వత్తిడి చేశారు.. కానీ ట్రంప్ ఒక్కరే ఒప్పుకున్నారు

న్యూఢిల్లీ: అమెరికా మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడి చేయాలని అమెరికాపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యహూ అనేకసార్లు వత్తిడి చేసినట్లు చెప్పారు. అమెరికా మాజీ అధ్యక్షులపైన కూడా గతంలో ఒత్తిడి జరిగినట్లు ఆయన చెప్పారు. కానీ నెతన్యహూ ప్రెజర్‌కు ట్రంప్ ఒక్కరూ ఒప్పుకున్నారని తెలిపారు. ద బ్రీఫింగ్ విత్ జెన్ సాకికి శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నెతన్యహూతో అనేక సార్లు చర్చలు జరిపానని, ఆ సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని అమెరికాపై వత్తిడి తెచ్చేవారని, ఇరాన్‌పై మిలిటరీ చర్యలు తీసుకోవాలని అమెరికాను కోరేవారన్నారు. ఇరాన్‌పై అమెరికా దాడి చేయాలన్న ఆకాంక్ష నెతన్యహూలో ఉన్నట్లు కెర్రీ పేర్కొన్నారు.రాన్‌పై దాడి అంశం గురించి గతంలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతోనూ నెతన్యహూ నేరుగా



చర్చించినట్లు చెప్పారు. కానీ ఆ ప్రతిపాదనను ఒబామా వ్యతిరేకించినట్లు కెర్రీ తెలిపారు. ఒబామా తిరస్కరించారు.. జో బైడెన్ తిరస్కరించారు.. ప్రెసిడెంట్ జార్జ్ బుష్ తిరస్కరించారు.. కేవలం ఒక్క ప్రెసిడెంట్ మాత్రమే అంగీకరించారని, ప్రెసిడెంట్ ట్రంప్ మాత్రమే ఇరాన్‌పై అటాక్ చేసినట్లు కెర్రీ తెలిపారు. ఇరానీ ముఖ్య నేతలను హతమార్చి, అధికార మార్పిడి చేసి, ఇరాన్ మిలిటరీని ధ్వంసం చేయాలన్న ఆలోచన నెతన్యహూకు ఉన్నట్లు ఆయన చెప్పారు. గతంలో ఇజ్రాయెల్ , అమెరికా అధికారులతో జరిగిన చర్చల సమయంలో నెతన్యహూ ఇవే ప్రతిపాదనలు చేసినట్లు కెర్రీ పేర్కొన్నారు.

## గేట్ కారేపల్లి ఆశ్రమ స్కూల్‌లో అక్రమాలు

**డీడీ ఆకస్మిక తనిఖీతో వెలుగులోకి**

**హెడ్మాస్టర్, డిప్యూటీ వార్డెన్ కు షోకాజ్ నోటీసులు**

కారేపల్లి, ఏప్రిల్ 11 : పేద గిరిజన బిడ్డలకు పౌష్టికాహారంతో కూడిన భోజనంతో పాటు ప్రమాణాలతో కూడిన విద్యను అందించి వారిని తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యం కొందరి అక్రమార్కుల వక్ర బుద్ధులతో నీరుగారుతోంది. ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ స్కూళ్లకు సకల సౌకర్యాలు సమకూర్చి అద్భుతమైన మెనూను రూపొందించి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా నిర్వహణ లోపం వల్ల గిరిజన సంక్షేమ శాఖ లక్ష్యం నెరవేరడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని గేట్ కారేపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఇటీవల ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయగా వారి అక్రమాలు వెలుగు చూసాయి. డీడీ స్వయంగా పరిశీలించిన అక్రమాలను చూస్తే డిప్యూటీ వార్డెన్, హెడ్మాస్టర్ కలిసి పేద గిరిజన పిల్లల పొట్టలు కొడుతున్న తీరు సభ్య సమాజాన్ని బాధించే అంశమే. పిల్లలకు కడుపు నిండా మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా వారి నోటికాడ కూడు తినడం అక్రమార్జనే ధ్యేయంగా పని చేస్తున్న వారి పట్ల అధికార యంత్రాంగం ఏ మాత్రం మానవత్వం చూపకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందిగిరిజన సంక్షేమ శాఖ ఖమ్మం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ మార్చి 20వ తేదీన గేట్ కారేపల్లి ఆశ్రమ పాఠశాల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో అక్రమాలన్నీ




ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.250 మంది విద్యార్థులకు గాను 348 మంది విద్యార్థులు హాజరైనట్లు నమోదు చేశారు. 98 మంది విద్యార్థులు హాజరు కాకపోయినా హాజరైనట్లు నమోదు చేశారు. బియ్యం బుక్ బ్యాలెన్స్ 41.60 కింటాళ్లు ఉండాల్సి ఉండగా స్టాక్ రూమ్ లో ఫిజికల్ బ్యాలెన్స్ 51 కింటాళ్లు ఉన్నాయి. కంది పప్పు బుక్ బ్యాలెన్స్ 70 కేజీలు ఉండగా ఫిజికల్ బ్యాలెన్స్ 55 కేజీలు ఉన్నాయి. సన్ ఫ్లవర్ ఆయిల్ బుక్ బ్యాలెన్స్ 64 ప్యాకెట్లు చూపగా స్టోర్ లో 116 ప్యాకెట్లు ఉన్నాయి. శనగ పప్పు బుక్ బ్యాలెన్స్ 34 కిలోలు గా పేర్కొనగా ఫిజికల్ బ్యాలెన్స్ 25 కిలోలు నిల్వ ఉన్నాయి. కోడి గుడ్లు బుక్ బ్యాలెన్స్ 630 చూపగా స్టోర్ లో 40 గుడ్లు మాత్రమే ఉన్నాయి. చింత పండు బుక్ బ్యాలెన్స్ 42 కేజీలు రాయగా స్టోర్ లో ఫిజికల్ బ్యాలెన్స్ 60కేజీలు ఉంది.అన్ని వస్తువుల్లో స్టాక్ రిజిస్టర్ కు స్టోర్ ఫిజికల్ బ్యాలెన్స్ కు భారీ వ్యత్యాసాన్ని గమనించిన డిప్యూటీ డైరెక్టర్ అవాక్కైనట్లు సమాచారం. మెనూ ఏమాత్రం పాటించడం లేదని విద్యార్థులు కూడా వాపోయారు. డిడి ఆకస్మిక తనిఖీలో ఆశ్రమ పాఠశాలలోని మెనూ సంబంధించిన విషయాలే కాకుండా విద్యా బోధనకు సంబంధించిన విషయాలు కూడా అనేకం వెలుగులోకి వచ్చాయి. పాఠశాల హెడ్మాస్టర్ స్థానికంగా ఉండకపోవడం, ఉపాధ్యాయులు కూడా నిబంధనల మేరకు స్టడీ అవర్లు నిర్వహించకపోవడం లాంటి అనేక అవకతవకలు వెలుగు చూశాయి.

## పూలేకు నివాళులు

హైదరాబాద్, మహాత్మ జ్యోతిరాబాపూలే 199 వ జయంతి పురస్కరించుకొని అంబర్పేటలోని ఆయన విగ్రహానికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి, మాజీ ఎంపీ వి హనుమంతరావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసిన నివాళ్ళు అర్పించారు.జయంతి సందర్భంగా నోటు బుక్స్ పంపిణీ చేశారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ తర్వాత మహాత్మా అనే బిరుదాంకితం చేసుకున్న వ్యక్తి జ్యోతిరావు పూలే. జ్యోతిరావు పూలే ఆశయాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మహిళా చదువులను ప్రోత్సహించిన వ్యక్తి జ్యోతిరావు పూలే. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రధాని జన గణన చేపడుతున్నట్లు రెడ్డి తెలిపారు..

## కాంగ్రెస్ మేనిఫెస్టోను అమలు చేయాలి: టీబీజీకేఎస్ డిమాండ్



తాండూర్ : సింగరేణి ఎన్నికల సమయంలో ఏఐటీయూసీ(, ఏఎన్‌టీయూసీ, కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు మేనిఫెస్టో ద్వారా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.శనివారం బెల్లంపల్లి ఏరియా తాండూర్ మండలం గోలేటి ఏరియా వర్క్ షాప్‌లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఫిట్ కార్యదర్శి గాజవేని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన గేటు మీటింగ్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐటీయూసి గెలిచిన తర్వాత కార్మికులు కోల్పోయిన హక్కులను వివరించారు. టీబీజీకేఎస్, కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి కార్మికులు ఎన్నో హక్కులను సాధించుకున్నారని తెలిపారు. ఫలితంగానే సింగరేణి కార్మికులు బీఆర్ఎస్ హయములో సంతోషంగా ఉండేవారని అన్నారు.రెండు సంవత్సరాలుగా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ గాని రాష్ట్ర ప్రభుత్వం గానీ సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా లాభాల వాటాను తగ్గించడంతోపాటు కేసీఆర్ అమలు అమలు చేసి ఉద్యోగ కారుణ్య నియమకాలను నిలిపివేశారని ఆందోళన వ్యక్తంచేశారు. మెడికల్ బోర్డులను నిర్వహించడం లేదని ఆరోపించారు.రానున్న సింగరేణి ఎన్నికలలో టీబీజీ కేఎస్ సొంతంగానే పోటీ చేస్తుందని ఎవరితో పొత్తు ఉండదని ఆయన పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో నాయకులు మంగీలాల్, మారిన వెంకటేశ్వర్లు, సెంట్రల్ జాయింట్ సెక్రటరీ ఓరం కిరణ్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సురేష్, స్టోర్ పిట్ సెక్రటరీ గణపతి, నాయకులు రమేష్, వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.

## ఓఎస్డీగా ఉన్న రిటైర్డ్ అధికారి అవినీతికి అంతే లేదు : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్




తెలంగాణలో నీళ్లు, నిధులు నియామకాల్లో అన్యాయం జరుగుతోందని.. ఆంధ్రా నుంచి వచ్చి రావడంతోనే ఓ అధికారికి ఎక్సైజ్ శాఖ కమిషనర్ పదవి ఇచ్చారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రా అధికారులకు కీలక పోస్టింగ్స్ ఇచ్చి తెలంగాణ అధికారులను అవమానిస్తున్నారు. ఆ ఆంధ్రా అధికారి తీరు వల్ల తెలంగాణ అధికారుల ఆరోగ్యాలు పాడవుతున్నాయి. ఆ ఆంధ్రా అధికారి తిట్ల దండకంతో తెలంగాణ ఉద్యోగులకు గుండె పోట్లు వస్తున్నాయి. బీసీ, ఎస్సీ , ఎస్టీలను కులం పేరుతో ఆ అధికారి దూషిస్తున్నాడు.సోమిరెడ్డి అనే సిన్సియర్ అధికారి ఆ ఆంద్రా అధికారి తిట్లకు కుప్ప కూలిపోయారు..ఆయన ఇప్పుడు కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రిజ్వి అనే అధికారి ఇప్పుటికే ఈ ప్రభుత్వం తీరుతో బలవంతంగా పదవీవిరమణ తీసుకున్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి దగ్గర ఓఎస్డీగా ఉన్న రిటైర్డ్ అధికారి అవినీతికి అంతే లేదు. కూకట్ పల్లిలో ఓ వైన్ షాప్‌లో ఆంధ్రా మద్యం దొరికింది. ఆంధ్రా మద్యం తెలంగాణలోకి ఎలా వచ్చింది..? ఆ మద్యాన్ని పట్టుకుని కొంత ఫైన్ వేసి లక్షల్లో లంచం తీసుకున్నారు.. ఈ లంచం నేరుగా మంత్రి ఓఎస్డీకే వెళ్లింది. ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. ఈ అవినీతి ఇట్లా ఉంటె ఆంధ్రా అధికారుల పెత్తనం మరో వైపు తెలంగాణ ఉద్యోగుల పట్ల శాపంలా మారుతోందన్నారు.తెలంగాణ ఉద్యోగుల పట్ల ఆంధ్రా అధికారుల వైఖరి మారకపోతే మరో ఉద్యమం వస్తుందని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినాక కూడా ఆంధ్రా ఉద్యోగుల పెత్తనం ఏమిటీ?? సోమిరెడ్డికి హ్యాట్సాఫ్ చెప్పాలి. ఆంధ్రా అధికారి బూతులతో ఇక తాను ఉద్యోగం చేయనని ఆత్మగౌరవం ప్రదర్శించారు. తెలంగాణ ఉద్యోగులు సోమి రెడ్డి లాగా ధైర్యాన్ని ప్రదర్శించాలి. తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బ తీస్తున్న ఆంధ్రా అధికారులకు తగిన బుద్ధి చెప్పాలి. ఉద్యోగులను వేధించిన ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్‌ను తక్షణమే విధుల నుంచి తప్పించాలి.. ఆయన ఎవరి రికమండేషన్‌తో ఆ పదవిలోకి వచ్చారో లోతుగా తెలుసుకుంటాం. ఏసీబీ తిమింగలాలను వదిలేసి చిరు ఉద్యోగుల మీద పడుతోంది.. ఎక్సైజ్ కానిస్టేబుళ్లను ఇష్టమొచ్చినట్టు బదిలీలు చేస్తున్నారు. ఆంధ్రా అధికారులకు గౌరవమిస్తే కుక్క చూపిన విశ్వాసం కూడా చూపడం లేదు . ఆంధ్రా అధికారులు తమ వైఖరి మార్చుకోవాలి. సోమిరెడ్డికి ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే భాద్యత అని హెచ్చరించారు.ప్రెస్ మీట్ లో మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ ,కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్ ,వాల్య నాయక్ ,రామచంద్ర నాయక్ ,సర్పంచ్ ల సంఘం మాజీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్ పాల్గొన్నారు

### అశ్రమ పాఠశాలలో 4వ తరగతి విద్యార్థి అనుమానాస్పద మృతి

కొమురంభీం ఆసిఫాబాద్ ,జైనూరు మండలంలోని ఆశ్రమ పాఠశాలలో, నార్నూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన దుర్వా అన్వేష్(10) అనే నాలుగవ తరగతి విద్యార్థి అనుమాస్పద మృతి చెందాడు. టీచర్ల నిర్లక్ష్యం వల్లే తమ కొడుకు చనిపోయాడని, ఘటన సమయంలో సిబ్బంది అందుబాటులో లేరని ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. పిల్లల మధ్య ఘర్షణ జరిగిందా లేక భవనం పైనుండి పడిపోయాడా అనే కోణంలో పోలీసులదర్యాప్తు చేస్తున్నారు.

# రాజ్యసభ రేసు

## భారీగా పెరుగుతున్న ఆశావహులు

విజయవాడ, ఏప్రిల్ 11,తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ సీట్ల కేటాయింపు అంశం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జూన్‌లో ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలకు గాను, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై పార్టీ వర్గాల్లో తీవ్ర స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మిగిలిన స్థానాలకు రకరకాల పేర్లు చర్చల్లోకి వస్తున్నాయి. టీడీపీ ఐటీ విభాగంలో చురుగ్గా ఉంటూ, గత ఎన్నికల్లో పార్టీ సోషల్ మీడియా వ్యూహకర్తగా పనిచేసిన చింతకాయల విజయ్ పేరు రేసులో ముందుండటానికి ప్రధాన కారణం యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్న అధిష్టానం ఆలోచనే. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి బలమైన బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విజయ్ వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొని పార్టీ కోసం నిలబడినందుకు ఆయనకు ఈ గుర్తింపు దక్కవచ్చని క్యాడర్ భావిస్తోంది.మరోవైపు, పార్టీలో అత్యంత సీనియర్ నేత అయిన యనమల రామకృష్ణుడు పేరు కూడా చర్చల్లో ఉంది. గత కొంతకాలంగా ఆయన రాజ్యసభకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీకి ట్రబుల్ షూటర్‌గా, ఆర్థిక వ్యవహారాల్లో పట్టున్న నేతగా యనమల సేవలను ఢిల్లీ స్థాయిలో ఉపయోగించుకోవాలని అధిష్టానం భావిస్తే ఆయనకు అవకాశం దక్కవచ్చు. అయితే, సామాజిక సమీకరణాలు , కొత్త రక్తాన్ని ఎక్కించాలనే లోకేష్ వ్యూహం కారణంగా సీనియర్లకు ఏ మేరకు ప్రాధాన్యత ఉంటుందన్నది ఉత్కంఠగా మారింది. వ్యాపార కారణాలు, రాజకీయ ఒత్తిళ్ల వల్ల గత లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్న గల్లా జయదేవ్ పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై గళం విప్పడంలో ఆయనకు ఉన్న అనుభవం, అంతర్జాతీయ స్థాయిలో ఆయనకున్న నెట్‌వర్క్ పార్టీకి అవసరమని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఆయన రాజకీయాలకు బ్రేక్ ఇస్తున్నట్లు గతంలోనే ప్రకటించినందున, మళ్లీ రాజ్యసభ ద్వారా క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది. ఇక గత ఎన్నికల్లో చాన్స్ దొరకని దేవినేని ఉమ కూడా రేసులో ఉన్నారు. యువనేతలు వంగవీటి రాధాతో పాటు మహాసేన రాజేష్ వంటి వారు కూడా సామాజికవర్గ కోటాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు ప్రధానంగా మూడు సూత్రాలను పాటిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. బీసీ, ఎస్సీ , కాపు సామాజిక వర్గాలకు సమతుల్యత పాటించడం.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా మాట్లాడగలిగే వ్యక్తులను పంపే అంశాలను పరిశీలిస్తున్నారు. వీరితో పాటు పార్టీ కోసం పనిచేసిన మరికొందరు పారిశ్రామికవేత్తలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కూడా టీడీపీ పరిశీలిస్తోంది. ఢిల్లీలో పార్టీ వాయిస్ బలంగా వినిపించే వారికే చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మిత్రపక్షాలకూ సీట్లు కేటాయించాల్సి ఉంది. జాతీయ స్థాయి ప్రాధాన్యత దృష్ట్యా బీజేపీ ఓ సీటును కోరుకుంటుందని అంచనా వేస్తున్నారు. బీజేపీకి ఇస్తే జనసేన పార్టీకి చాన్స్ ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉన్నందున అభ్యర్థుల ఎంపికను చంద్రబాబు ఫైనల్ చేస్తున్నారు.

## ఏపీలో చిన్నారులకు సోషల్ మీడియా బ్యాన్

నెల్లూరు, ఏప్రిల్ 11, ఏపీలో 13 ఏళ్ల పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ చేయటంపై ప్రభుత్వం ఫోకస్ పెటటింది. ఇప్పటికే ప్రాథమికంగా కసరత్తు చేయగా? త్వరలోనే విధివిధానాలు తయారుచేసి, ముసాయిదా చట్టాన్ని సిద్ధం చేయనున్నారు.ఇదే అంశంపై తాజాగా ఐటీ మంత్రి నారా లోకేశ్ సమీక్షించారు. చిన్నపిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు విధివిధానాల తయారీ, చట్టరూపకల్పనపై మంత్రుల బృందం చర్చించింది పిల్లలకు వయసు ఆధారిత కంటెంట్ ను అందుబాటులో ఉంచేవిధంగా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో మహిళలపట్ల అవమానకరమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పిల్లల డిజిటల్ భద్రత, శ్రేయస్సు, లీగల్ మెకానిజం ఫ్రేమ్ వర్క్ పై ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను అధికారులు అధ్యయనం చేయాలన్నారు.పిల్లలను సెన్సిటివ్ కంటెంట్ కు దూరంగా ఉంచడంపై ఆస్ట్రేలియా, సింగపూర్, డెన్మార్క్ వంటి దేశాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. నో బ్యాగ్ డే రోజున ఉపాధ్యాయులు విద్యార్థులకు, ప్రతిఏటా రెండుసార్లు నిర్వహించే మెగా పిటిఎంలో కూడా తల్లిదండ్రులు, విద్యార్థులకు సోషల్ మీడియా దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తామన్నారు.వయసు నిర్ధారణ కోసం డిజిలాకర్ తో కూడిన ఏజ్ టోకెన్ ల వినియోగంపై అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేశ్ అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయం అనంతరం కేంద్రప్రభుత్వ చట్టపరిధిలోని అంశాలపై నివేదికను అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సున్నితమైన కంటెంట్ ను చిన్నపిల్లలకు దూరంగా ఉంచడంపై విధివిధానాలు, ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలను వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫాంల ప్రతినిధులు మంత్రుల బృందానికి వివరించారు. ఐటీ చట్టంలోని సెక్షన్ ? 46 కింద న్యాయ నిర్ణయాధికారిని వెంటనే నియమించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.13 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాథమికంగా కసరత్తు చేస్తోంది. ఆస్ట్రేలియా, సింగపూర్ మరియు డెన్మార్క్ వంటి దేశాల్లో అమలులో ఉన్న మైనర్ల డిజిటల్ భద్రతా చట్టాలను అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ముసాయిదా చట్టం సిద్ధం చేసిన తర్వాత ఏపీ కేబినెట్ ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత శాసనసభ ఆమోదం తర్వాత? గవర్నర్ సంతకం చేయాలి. ఆ తర్వాత గెజిట్ విడుదలవుతుంది.

## 14 నుంచి 21 చిత్తూరు జిల్లాల్లో నియోజకవర్గాలు

తిరుపతి, ఏప్రిల్ 11, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు సొంత జిల్లా అయిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలతో జిల్లా రాజకీయ స్వరూపమే మారిపోబోతోంది. ప్రస్తుతం ఉన్న 14 అసెంబ్లీ స్థానాల సంఖ్య ఏకంగా 21కి పెరిగే అవకాశం ఉండటంతో రాజకీయ పార్టీల్లోనూ, అభ్యర్థుల్లోనూ కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. 2004 వరకు ఉమ్మడి జిల్లాలో 15 నియోజకవర్గాలు ఉండేవి. 2009 పునర్విభజనలో వాయల్పాడు, పుత్తూరు, వేపంజేరి నియోజకవర్గాలు రద్దు కాగా.. కొత్తగా గంగాధర నెల్లూరు, పూతలపట్టు ఏర్పడ్డాయి. దీంతో సీట్ల సంఖ్య 14కి తగ్గింది. అయితే తాజా ప్రతిపాదనల ప్రకారం ఈ సంఖ్య 21కి చేరనుండటం విశేషం.రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా ఆవిర్భవించిన తిరుపతిలో జనాభా ప్రాతిపదికన భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలో భాగంగా ఉన్న తిరుపతి రూరల్ మండలాన్ని విడదీసి కొత్త నియోజకవర్గంగా మార్చే అవకాశం ఉంది. ఇందులో రామచంద్రపురం మండలాన్ని కూడా కలిపే అవకాశం ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య భారీగా ఉండటంతో రేణిగుంట కేంద్రంగా కొత్త సీటు ఏర్పాటుపై చర్చ జరుగుతోంది. రద్దయిన పుత్తూరు నియోజకవర్గం మళ్ళీ తెరపైకి రానుంది. సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి నాయుడుపేటను విడదీసి కొత్త నియోజకవర్గం చేసే ఛాన్స్ ఉంది.పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళ్యం కేంద్రంగా కొత్త స్థానం ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. పీలేరు నియోజకవర్గం నుంచి కలికిరి కేంద్రంగా మరో కొత్త నియోజకవర్గం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# కేబినెట్ లో లీక్ వీరులు...

కాకినాడ, ఏప్రిల్ 11, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు ఒకే ఒక అంశం హాట్ టాపిక్‌గా మారింది. అదే 'కేబినెట్ అజెండా లీక్'. ప్రభుత్వ నిర్ణయాలు అధికారికంగా వెలువడక ముందే బయటకు పొక్కడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ అంశంపై మంత్రులకు ఆయన క్లాస్ పీకడమే కాకుండా, సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సాధారణంగా కేబినెట్ సమావేశం అంటే అత్యంత గోప్యంగా జరిగే ప్రక్రియ. అందులో చర్చించే అంశాలు, తీసుకోబోయే నిర్ణయాలు సమావేశం ముగిసిన తర్వాత మీడియాకు వెల్లడిస్తారు. కానీ, గత కొంతకాలంగా ఏపీలో కేబినెట్ భేటీ కంటే ముందే అజెండాలోని అంశాలు మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. దీనిపై చంద్రబాబు గుర్రుగా ఉన్నారు.ప్రభుత్వంలోని అత్యున్నత నిర్ణాయక మండలి నిర్ణయాలు ఇలా వీధికెక్కడం ఏంటని సీఎం మంత్రులను సూటిగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కీలక సమాచారం బయటకు వెళ్లడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, కొన్ని నిర్ణయాల అమలులో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు గత చరిత్రను గుర్తు చేస్తూ మంత్రులను హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్టీఆర్ తీసుకున్న సంచలన నిర్ణయాన్ని ఆయన ప్రస్తావించారు. గతంలో కేబినెట్ అజెండా లీక్ అయినప్పుడు, క్రమశిక్షణ విషయంలో రాజీ పడని ఎన్టీఆర్ ఏకంగా తన పూర్తి మంత్రిమండలిని రద్దు చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. ఇకపై అజెండా లీక్ అయితే దానికి సంబంధిత శాఖా మంత్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు.ప్రభుత్వ సమాచారం లీక్ అవ్వడం వెనుక రెండు ప్రధాన కోణాలు కనిపిస్తున్నాయి. తాము చేస్తున్న పనులు లేదా తీసుకోబోయే నిర్ణయాలను ముందే లీక్ చేయడం ద్వారా క్రెడిట్ కొట్టేయాలని కొందరు మంత్రులు లేదా వారి అనుచరులు ప్రయత్నిస్తున్నారా? అనే అనుమానం ఉంది. మంత్రుల కార్యాలయాల్లోని పీఎస్ లు లేదా ఇతర సిబ్బంది ద్వారా మీడియాకు సమాచారం చేరుతోందా? అనే కోణంలోనూ చర్చ జరుగుతోంది. భూముల కేటాయింపు లేదా కొత్త పథకాలకు సంబంధించిన నిర్ణయాలు ముందే లీక్ అయితే మార్కెట్ శక్తులు వాటిని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కేబినెట్ గోప్యతను కాపాడలేకపోతే ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న పట్టు సడలుతుందనే భావన ఏర్పడుతుంది.చంద్రబాబు కేవలం హెచ్చరికతోనే ఆగిపోకుండా, నిఘా పెంచాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. "గతంలో లీకులు జరిగాయి.. ఇకపై అవి పునరావృతం కాకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ఉదంతాన్ని గుర్తు చేయడం ద్వారా, తాను కూడా కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడబోననే సంకేతాన్ని తన కేబినెట్ సహచరులకు పంపారు.

## జనారణ్యంలోకి జంతువులు

కర్నూలు, ఏప్రిల్ 11, (రాయలసీమ వ్యాప్తంగా జనావాసాల్లోకి చిరుతల చొరబాట్లు పెరగడం కనిపిస్తోంది. పులులకు తీవ్రమైన నీటి కొరత, ఆవాసాలు తగ్గిపోవడం, పెరుగుతున్న పర్యావరణ ఒత్తిడే ఈ ధోరణికి కారణమని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోకపోతే.. ఈ ప్రాంతంలో మానవ-వన్యప్రాణుల సంఘర్షణ తీవ్రంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.వైఎస్ఆర్ కడప జిల్లా దువ్వూరు మండలం చిన్న బకరపురం గ్రామంలో ఇటీవల జరిగిన ఓ ఘటన జరిగింది. గ్రామంలోకి ప్రవేశించిన చిరుత పిల్లను వీధి కుక్కలు చంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అటవీ అధికారుల సమాచారం ప్రకారం, రాయలసీమలో గత మూడేళ్లలో మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశించిన 30కి పైగా చిరుతలు మరణించాయి. ఆందోళనకరంగా, గత సంవత్సరంలోనే 16 మరణాలు నమోదయ్యాయి.చిరుతపులులు మేకలు, గొర్రెలు, దూడలు, ఆవులు వంటి జంతువులను ఇష్టపడతాయి. ఆహారం కోసం అవి మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయి. కొన్నిసార్లు, అటవీ ప్రాంతాల్లో సమీపంలో నీటి వనరులు లేకపోవడం కూడా ఒక కారణంగా ఉంది. చిరుతపులులు దట్టమైన అడవుల్లో లోపల ఉండటానికి బదులుగా, కొద్దిగా బహిరంగ లేదా మైదాన ప్రాంతాల్లోకి వెళ్లడానికి ఇష్టపడతాయని అటవీ అధికారులు అంటున్నారు.చిరుతపులులు మనుషులపై దాడి చేయడానికి బయటకు రావడం లేదు. కానీ ఆకస్మాత్తుగా మనిషి ఎదురైతే దాని రక్షణలో భాగంగా దాడి చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. వాటి సంచారం ప్రధానంగా ఆహారం, నీటి అన్వేషణ కోసమే ఉంటుంది. అడవుల అంచున ఉన్న గ్రామాల్లోకి చిరుతలు ఎక్కువగా వస్తుంటాయి.వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులు, అడవి పందులను నివారించడానికి రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలు పులులకు ఇబ్బందికరంగా మారాయి. విద్యుత్ కంచెల కారణంగా ప్రమాదవశాత్తు మరణాలు పెరుగుతున్నాయి. రైతులలో తక్షణమే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.అటవీ భూముల ఆక్రమణలతో పులుల సహజ ఆవాసాలను తగ్గిపోయేలా చేస్తూ, వన్యప్రాణులను మానవ నివాసాలకు మరింత దగ్గరగా నెడుతున్నాయి. దట్టమైన అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ఇప్పుడు జనావాస ప్రాంతాల వైపు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుతపులుల సంచారం ఎక్కువగా ఉందని, ఇది తమ జీవనోపాధికి ముప్పుగా మారిందని రైతులు వాపోతున్నారు.కొన్నిసార్లు పొలాల దగ్గర చిరుతపులులు సంచారం ఉన్నట్టుగా రైతులు చూస్తున్నారు. దానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పశువులను, మేకలను మేతకు బయటకు తీసుకెళ్లాలంటే భయపడుతున్నాయి.

# టీడీపీలో థర్డ్ జనరేషన్..3.0

విజయవాడ, ఏప్రిల్ 11, తెలుగుదేశం పా జాతీయ ప్రధాన కార్యదర్శి , మంత్రి నారా లోకేష్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై తనదైన ముద్ర వేస్తున్నారు. పార్టీని సాంకేతికంగా పరిపుష్టం చేస్తూ, అట్టడుగు స్థాయి కార్యకర్తలతో నేరుగా సంబంధాలు నెలకొల్పుకుంటూ ఎఆఖ 3.0 అనే కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. లోకేష్ ఇటీవలే ఎఆఖ 3.0 వెర్షన్‌ను లాంచ్ చేశారు. ఇది కేవలం ఒక నినాదం కాదు, పార్టీని మరింత శక్తివంతంగా, జవాబుదారీతనంతో నడిపించే ఒక వ్యవస్థ. ఇందులో భాగంగా కార్యకర్తలకు నేరుగా గుర్తింపు ఇవ్వడం, వారి పనితీరును అంచనా వేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీని ఒక నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలని, ఏడాదికి కనీసం 300 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు.పార్టీలో క్రమశిక్షణ విషయంలో లోకేష్ చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మళ్లీ గెలవాలంటే ప్రజల మధ్యే ఉండాలి అని ఎమ్మెల్యేలకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. రెవెన్యూ వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నా, ఇసుక లేదా ఇతర అక్రమ రవాణాలో పాల్గొన్నా సహించేది లేదని తెగేసి చెప్పారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరును, ప్రజల్లో వారికున్న ఇమేజ్‌ను ఎప్పటికప్పుడు సర్వేల ద్వారా అంచనా వేస్తూ, గ్రాఫ్ పడిపోయిన వారికి క్లాస్ తీసుకుంటున్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి లోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 85కు పైగా ప్రజా దర్బార్లు నిర్వహించి, వేలాది మంది అర్జీలను స్వయంగా స్వీకరించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఉదయాన్నే అందుబాటులో ఉంటూ, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులతో నేరుగా మాట్లాడుతున్నారు. ఇది కేవలం సామాన్య ప్రజలకే కాకుండా, పార్టీ కార్యకర్తలకు కూడా తమ నాయకుడిని నేరుగా కలిసే ధైర్యాన్ని ఇస్తోంది.సాంకేతికతపై పట్టున్న లోకేష్, పార్టీ పర్యవేక్షణ కోసం ఓఎ ఎఆఖ యాప్‌ను సమర్థవంతంగా వాడుతున్నారు. ఈ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో ఏ కార్యకర్త చురుగ్గా ఉన్నారో, ఏ బూత్ స్థాయిలో పార్టీ బలహీనంగా ఉందో డేటా రూపంలో విశ్లేషిస్తున్నారు. పనితీరు ఆధారంగానే పదవులు, గుర్తింపు ఉంటాయని స్పష్టం చేయడం ద్వారా పార్టీలో సమర్థులకు ప్రాధాన్యత లభిస్తోంది. పారిశ్రామిక వేత్తల తరహాలో డాష్ బోర్డ్ మేనేజ్‌మెంట్ ద్వారా పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించడం ఆయన పనితీరుకు నిదర్శనం. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను లోకేష్ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వైసీపీ హయాంలో కేసులు ఎదుర్కొన్న వారిని ఆదుకోవడంతో పాటు, పార్టీ ఆవిర్భావ దినోత్సవం వంటి వేదికలపై సామాన్య కార్యకర్తలకు సీనియర్ నేతలతో సమానంగా గౌరవం కల్పిస్తున్నారు. పదవులు మూడు సార్లు మాత్రమే అనే కొత్త ప్రతిపాదన ద్వారా కొత్త రక్తాన్ని పొలిట్‌బ్యూరో స్థాయికి చేర్చాలని ఆయన చూస్తున్నారు. ఇది యువ నాయకత్వంలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.లోకేష్ కేవలం చంద్రబాబు వారసుడిగా కాకుండా, తనకంటూ ఒక సొంత పనితీరు బ్రాండ్‌ను సృష్టించుకున్నారు. అడ్మినిస్ట్రేషన్‌లో చురుగ్గా ఉంటూనే, పార్టీ యంత్రాంగాన్ని 24/7 అలెర్ట్‌గా ఉంచడంలో ఆయన సఫలీకృతమవుతున్నారు. లోకేష్ అనుసరిస్తున్న ఈ కార్పొరేట్ తరహా రాజకీయ వ్యూహం, అట్టడుగు స్థాయి కార్యకర్తలతో ఉన్న అనుబంధం టీడీపీని రాబోయే దశాబ్ద కాలానికి సిద్ధం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## వైసీపీలో మారుతున్న సామాజిక లెక్కలు

విజయవాడ, ఏప్రిల్ 11,వైఎస్సార్ పార్టీ.. ఏపీలో విపక్షం. మాజీ సీఎం వైఎస్సార్ తనయుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి, ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్ర విభజన, కాంగ్రెస్ వైఖరితో విభేదించి కొత్తపార్టీ పెట్టిన రాజకీయ అసాధ్యుడు. ఐదేళ్ల విపక్ష బాధ్యతల తర్వాత 2019లో అధికారాన్ని సైతం సాధించి, సీఎంగా పాలన సాగించారు. పరిపాలన సమయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలకు ప్రజామోదం లేకపోవడం, అదే సమయంలో చంద్రబాబు, లోకేష్ అలుపెరగక చేపట్టిన ప్రచారంతో.. వైసీపీ ఘోరంగా ఓటమి పాలైంది.బేసిగ్గా చూస్తే.. జగన్ అధికారంలో ఉన్నప్పుడు వైసీపీలో ఎక్కువ పదవులు రెడ్డి సామాజిక వర్గానికే దక్కాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయా సామాజిక వర్గం నేతలు.. రాజకీయాల్లో హడావుడి చేసేవారు. వారు కోటరీ కట్టి జగన్ కు కళ్లు, చెవులుగా



వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. అలాంటి నేతలు పవర్ పోవడం, లోకేష్ రెడ్ బుక్ లాంటి పరిణామాలతో కాస్త సైలెంట్ అయ్యారు. వారిస్థానాల్లో ఇప్పుడు బీసీ, ఎస్సీ ఎస్టీ నేతలు .. ముందుండి పార్టీ కార్యక్రమాలను నడుపుతున్నారు.బొత్స సత్యనారాయణ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా చురుకుగా వ్యవహరిస్తుండగా, అంబటి రాంబాబు, పేర్ని నాని పార్టీ స్వరంగా నిలుస్తున్నారు. జోగి రమేష్ కూడా బెయిల్‌పై విడుదలైన తర్వాత తన స్వరాన్ని మరింత పెంచారు. పార్టీ కార్యక్రమాలు, మీడియా సమావేశాల్లో వీరే ముందుండటం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే? వైసీపీలో సామాజిక సమీకరణాలు కొత్త దిశగా మారుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.కష్టకాలంలో బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన నేతలు ముందుకు వచ్చి పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని, అదే సమయంలో జగన్‌కు సమీపంగా ఉన్న నేతలు వ్యూహాత్మకంగా దూరంగా ఉంటున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇదే నేతలు ఒక వేళ జగన్రాజకీయంగా పుంజుకుంటే మళ్లీ ఆయన పక్కకు చేరతారని, కోటరీ కడతారనే వాదనలు వినిపిస్తున్నాయి.గతంలో జగన్ అధికారంలోకి రాగానే తన సామాజిక వర్గానికి చెందిన వారికి ముఖ్యమైన మంత్రి పదవులను అప్పగించారు. జగన్ హయాంలో దాదాపు 24 మంది ప్రభుత్వ సలహాదారులలో 17 మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే ఉండటం అప్పట్లో రాజకీయంగా చర్చనీయాంశమైంది.

# వైసీపీతో బీసీవై కలిసి పోటీ...

విజయవాడ, ఏప్రిల్ 11, రాజకీయాల్లో ఎవరు ఎప్పుడు ఏ స్థితిలో ఉంటారో చెప్పలేము. ఎందుకంటే ఒకసారి ఓటమి ఎదురవుతుంది. మరోసారి గెలుపు తలుపు తడుతుంది. అయితే రాజకీయ అవసరాలు కూడా అంతే. ఎవరితో ఏ అవసరం వస్తుందో చెప్పలేం కూడా. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అదే పరిస్థితి. ప్రత్యర్థి పార్టీలను ఓ రేంజ్ లో వేసుకోవడం వైసీపీకి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అయితే ఈ విషయంలో జనసేన కూడా బాధితురాలు. ఎందుకంటే జనసేన ను టార్గెట్ చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రచారం అంటూ లేదు. మొన్న జనసేన సంపూర్ణ విజయం, వైయస్సార్ కాంగ్రెస్ దారుణ ఓటమితో ఈ ప్రచారం కొట్టుకెళ్లిపోయింది. కానీ ఇప్పుడు అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భారత చైతన్య యువజన పార్టీ.. అలియాస్ బిసివై పార్టీపై ఆధారపడుతోందన్న టాక్ ప్రారంభం అయింది. ఆ పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడుతుండడం కొత్త రాజకీయ పరిణామం.చిత్తూరు జిల్లాకు చెందిన బోడె రామచంద్ర యాదవ్ భారత యువజన చైతన్య పార్టీని ఏర్పాటు చేశారు. బడుగులకు రాజ్యాధికారం అన్న నినాదంతో ఈ పార్టీని స్థాపించారు. పారిశ్రామికవేత్త అయిన బోడే రామచంద్ర యాదవ్ కు కేంద్రంలో మంచి పట్టు ఉంది. 2019 ఎన్నికల కు ముందు పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి జనసేన తరఫున పుంగనూరు నుంచి పోటీ చేశారు. కానీ ఓటమి ఎదురయింది. కనీసం డిపాజిట్లు రాలేదు. అయితే తరువాత భారత చైతన్య యువజన పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బీసీవై పార్టీని టార్గెట్ చేశారు. పలుమార్లు బోడే రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి కూడా జరిగింది. కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టార్గెట్ చేస్తూ చంద్రబాబు బీసీవై పార్టీ వెనుక ఉన్నారనేది అప్పట్లో ఒక విమర్శ.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అయితే బోడె రామచంద్ర యాదవ్ పై ఓ రేంజ్ లో విరుచుకు పడేవారు. ఆయన పేరును ప్రస్తావించేందుకు కూడా ఇష్టపడేవారు కాదు. పూజకు పనికిరాని పువ్వు అని సంబోధించేవారు. గతంలో బోడె రామచంద్ర యాదవ్ పై దాడి జరిగినప్పుడు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఖండించారు. ఒక సాధారణ నేతగా ఉన్న బోడె రామచంద్ర యాదవ్ విషయంలో ప్రతిపక్ష నేత స్పందించడం అప్పట్లో ఒక సంచలనమే. కనీసం బీసీవై పార్టీ ఒక పార్టీయేనా అని వ్యాఖ్యానించేవారు వైసీపీ సామాన్య కార్యకర్తలు.. కానీ ఇటీవల ఎందుకో బోడె రామచంద్ర యాదవ్ రూట్ మారింది. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వాన్ని విపరీతంగా వ్యతిరేకిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి విషయంలో సానుకూలంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి కట్టాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. అందులో భాగంగానే బీసీవై పార్టీని కూటమి ప్రభుత్వంపై ఉసిగొల్పుతున్నారన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# పోషణ్ పక్వాడాతో ఆరోగ్య అవగాహన:- కలెక్టర్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 11:పోషణ్ పక్వాడా కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో మహిళా, శిశు అభివృద్ధి శాఖ అధికారులకు నిర్వహించిన ఓరియంటేషన్ శిక్షణలో ఆమె పాల్గొన్నారు. ఈ నెల 23 వరకు కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించి, పోషకాహారం, ఆరోగ్యకరమైన అలవాట్లపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జంక్ ఫుడ్ అధిక వినియోగం వల్ల రక్తపోటు, మధుమేహం, ఊబకాయం వంటి సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. సహజమైన ఆహారం, పండ్లు, కూరగాయలు తీసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. పిల్లల అభివృద్ధిలో తొలి రెండేళ్లు కీలకమని, ఈ సమయంలో మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. చిన్నారుల్లో స్క్రీన్ టైమ్ తగ్గించి, ఆటలు, పుస్తక పఠనం, కుటుంబంతో సమయం గడపడం వంటి అలవాట్లు పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు, సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# పొజిషన్ సర్టిఫికేట్ కోసం ఆఫీసుల చుట్టూ తిరిగి విసిగి మాజీ కరణం మృతి--

విభారె న్యూస్ ? నంద్యాల మా ప్రతినిధి, ఏప్రిల్ 11:శిరివెళ్ల గ్రామానికి చెందిన మాజీ కరణం సుబ్బారావు (10-04-2026 సాయంత్రం 7.30) మృతి స్థానికంగా విషాదాన్ని నింపింది. ఇంటి వెనుక ఉన్న స్థలానికి సంబంధించిన పొజిషన్ సర్టిఫికేట్ కోసం ఆయన కొంతకాలంగా ప్రభుత్వ



కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. అవసరమైన పత్రాల కోసం పలుమార్లు కార్యాలయాలకు వెళ్లినా పని ముందుకు సాగలేదని, ఫైళ్ల పురోగతి లేకపోవడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మృతి స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, ఉద్యోగులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించే విధానాన్ని బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# కార్పొరేట్ కాలేజీలు వద్దు-

## ప్రభుత్వ, లోకల్ ప్రైవేట్ కాలేజీలే మేలు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 11: కార్పొరేట్ విద్యాసంస్థలు ర్యాంకుల పేరుతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ మండల కార్యదర్శి లతీఫ్ విమర్శించారు. కొద్ది మందికి మాత్రమే ర్యాంకులు వస్తున్నా, వాటిని భారీగా ప్రచారం చేస్తూ మిగిలిన విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులపై అధిక ఒత్తిడి, భారీ ఫీజులు, భావోద్వేగాల దోపిడీ వల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ, చిన్న ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థులకు వ్యక్తిగత శ్రద్ధ, ఉల్లాసమైన వాతావరణం, బహుముఖ కార్యకలాపాలకు ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, కార్తీక్, మహేష్, సంతోష్ పాల్గొన్నారు.




# పూలే ఆశయాలను ఆచరించాలి-- మంత్రి ఫరూక్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 11:మహాత్మ జ్యోతిరావు పూలే గారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ పిలుపునిచ్చారు. పూలే 200వ జయంతి సందర్భంగా నంద్యాల పద్మావతి నగర్ వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కార్తీక్ తదితరులు పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. ఇండోర్ స్టేడియంలో



జరిగిన సభలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పూలే గారు సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని అన్నారు. విద్య ద్వారా సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి సాధ్యమని ఆయన సూచించిన మార్గం నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ స్త్రీ విద్య ప్రాముఖ్యతను పూలే దంపతులు ముందుగానే గుర్తించారని, “ఒక మహిళ చదువుకుంటే కుటుంబం అభివృద్ధి చెందుతుంది” అనే భావనను సమాజం ఆచరించాలని అన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా విద్య, పోషణ, డిజిటల్ బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ పూలే జీవితం సామాజిక న్యాయం కోసం సాగిన పోరాటానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా రైతు సంఘం జెండా ఆవిష్కరణ..




విభారే న్యూస్ ఏప్రిల్ 11 ఎమ్మిగనూరు..ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని సిపిఐ కార్యాలయం లెనిన్ భవన్ నందు రైతు సంఘం తాలూకా అధ్యక్షులు మాలిక్ అధ్యక్షతన నిర్వహించుకోవడం జరిగినది మాలిక్ జెండా ఎగరవేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏఐకేఎస్ 1936 ఏప్రిల్ 11న ఉత్తర్ ప్రదేశ్ లక్నో నందు మొట్టమొదటి జాతీయ అధ్యక్ష కార్యదర్శులుగా స్వామి సహజ నంద సరస్వతి ఆచార్య ఎన్జీరంగాలు ఉన్నారని అప్పటి పరిస్థితుల్లో బ్రిటిష్ పాలకుల చేతుల్లో మన భారతదేశం ఉండేదని అప్పుడు జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిందని రైతులు భూముల మీద పన్నులు కట్టాలని బ్రిటిష్ పాలకులు బలవంతపు వసూళ్లు ఆపాలని రైతుల పక్షాన ఏఐకేఎస్ పోరాటాలు చేసిందని స్వాతంత్రం వచ్చిన మీదట అప్పట్లోఅధికార కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా రైతుల పక్షాన పోరాటాలు చేసి దున్నేవానికి భూమి హక్కు కావాలని పెత్తందార వ్యవస్థకు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా నినదించింది అదేవిధంగా భారతదేశంలో ఉన్న ప్రైవేట్ బ్యాంకులన్నీ జాతీయ కరణ చేయాలని పోరాటం చేసి బ్యాంకులన్నీ ప్రభుత్వ పరమయ్యాయి అదేవిధంగా దేశంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల భూములకు సాగునీరు అందించాలని పోరాటాలు చేసింది ప్రస్తుతం వ్యవసాయం రంగం కుదేలైన సందర్భంగా అధికార కేంద్ర బిజెపి కూటమిప్రభుత్వానిక వ్యతిరేకంగా రైతుల పక్షాన భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తుంది వ్యవసాయ రంగం అభివృద్ధిలోకి రావడానికి డాక్టర్ స్వామి నాథన్ కమిటీ సిఫారసులు, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం అ2+50 శాతం ధరలు ఉండేటట్లు చట్టబద్ధం చేయాలని 2025 విత్తన చట్టం రద్దు చేయాలని రైతులకు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ విధానాలు అమలు చేయాలని బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంట రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంట రుణాలు రైతు భరోసా డబ్బులు పలు, ఆరుగాలం వ్యవసాయం చేసే రైతులకు 60 సంవత్సరాలు దాటిన తర్వాత వారికి కూడా నెలకు 10,000 పెన్షన్ ఇవ్వాలని ఈ డిమాండ్ల సాధన కోసం భవిష్యత్ పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు మద్దిలేటి నాయుడు సిపిఐ జిల్లా సమితి సభ్యులు సోమేశ్వర్ రెడ్డి సిపిఐ మండల కార్యదర్శులు గిడ్డయ్య రాజీవ్ కాజా ఇస్మాయిల్ మల్లికార్జున గౌడ్ నరసింహులు,జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# పోషణ్ పక్వాడా ద్వారా ఆరోగ్య అవగాహన

**- కలెక్టర్ రాజకుమారి పిలుపు**

**పిల్లల అభివృద్ధిలో తొలి రెండేళ్లు కీలకం**

**- కలెక్టర్స్క్రీన్ టైమ్ తగ్గించి ఆటలు, పుస్తక పఠనం పెంచాలి**

**మహిళా, శిశు అభివృద్ధి అధికారులకు ఓరియంటేషన్ ట్రైనింగ్**

నంద్యాల, ఏప్రిల్ 11:-జిల్లాలో ఈ నెల 23వ తేదీ వరకు పోషణ్ పక్వాడా ద్వారా ఆరోగ్య అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా మరియు శిశు అభివృద్ధి, సాధికారత శాఖలో పనిచేస్తున్న అధికారులకు నిర్వహించిన ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, “పోషణ్ పక్వాడా” 8వ ఎడిషన్ కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ వరకు సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యకరమైన అలవాట్లపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్యాక్ చేసిన జంక్ ఫుడ్ వినియోగం వల్ల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలు పడుతున్నాయని ఆమె హెచ్చరించారు. అధిక ఉప్పు, సోడియం కలిగిన ఆహారం వల్ల రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, మూత్రపిండ సమస్యలు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. అలాగే జంక్ ఫుడ్ వల్ల ఖాళీ కేలరీలు అధికంగా శరీరంలో చేరి ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. పీచు పదార్థాల లోపం కారణంగా జీర్ణక్రియ సమస్యలు, మలబద్ధకం వంటి ఇబ్బందులు వస్తాయని, సహజమైన పండ్లు, కూరగాయలు, పోషకాహారం తీసుకొనేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అదనపు చక్కెరలు, ప్రిజర్వేటివ్స్ ఉన్న ఆహారం పిల్లల్లో ప్రవర్తనా సమస్యలు, ఏకాగ్రత లోపం, అతి చురుకుదనం వంటి సమస్యలకు దారితీస్తుందని తెలిపారు. మన సంప్రదాయ ఆహారం ఆరోగ్యానికి బలమని, స్థానిక ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చిన్నారులకు చక్కెర వినియోగాన్ని తగ్గించడం, మొబైల్ ఫోన్లు, టీవీ స్క్రీన్‌లను దూరంగా ఉంచడం అత్యంత అవసరమని చెప్పారు. అధిక స్క్రీన్ టైమ్ వల్ల నిద్రలేమి, కంటి సమస్యలు, మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య పోషకాహారం, క్రమబద్ధమైన ఆటలు, కుటుంబంతో గడిపే సమయం కీలకమని పేర్కొన్నారు. ఇంటి లోపల, బయట ఆటలు ఆడేలా ప్రోత్సహించడం ద్వారా శారీరక, సామాజిక నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. అలాగే పుస్తక పఠనం, కథలు చెప్పడం వంటి అలవాట్లు పిల్లల్లో ఊహాశక్తి, సృజనాత్మకతను పెంపొందిస్తాయని, భాషా నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. పెద్దలతో సమయం గడపడం ద్వారా కుటుంబ బంధాలు బలపడటమే కాకుండా సంప్రదాయాలు తదుపరి తరాలకు చేరుతాయని పేర్కొన్నారు.

# ఆపరేషన్ వజ్రప్రహార్--: నంద్యాలలో విస్తృత తనిఖీలు---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 11-నేర రహిత సమాజమే లక్ష్యంగా, మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా నంద్యాల జిల్లావ్యాప్తంగా పోలీసులు శనివారం తెల్లవారుజామున “ఆపరేషన్ వజ్రప్రహార్”లో భాగంగా కార్డన్ అండ్ సర్చ్ తనిఖీలు నిర్వహించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ పర్యవేక్షణలో నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, ఢోన్ సబ్‌డివిజన్లలో ఈ తనిఖీలు జరిగాయి. నంద్యాల పట్టణంలోని బయటిపేటలో అనుమానితుల ఇళ్లను తనిఖీ చేసి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఆత్మకూరు పరిధిలో అమలాపురం, కృష్ణాపురం గ్రామాల్లో అనుమానితుల ఇళ్లు, పాత గంజాయి నేరస్తుల ఇళ్లు తనిఖీ చేసి వాహనాలు సీజ్ చేశారు. ఆళ్లగడ్డలో టిడ్కో కాలనీలో తనిఖీల్లో పలువురు అనుమానితులను ప్రశ్నించి, అరెస్ట్ వారెంట్ ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఢోన్‌లో స్థానిక పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తంగా వందలాది వాహనాలు తనిఖీ చేయగా, పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీసులు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# పెద్దమ్మ తల్లి జాతరకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గారికి ఆహ్వాన పత్రికను అందజేసిన నోసుం గ్రామ పెద్దలు



సంజామల మండలం నో సుం గ్రామంలో ఈనెల 27 తేదీన పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవము నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కావున 27వ తారీకు సోమవారము రాత్రి శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతులు, 28 తారీఖున రాత్రి 10 గంటలకు అమ్మవారి ఉత్సవము కార్యక్రమం, 29వ తారీఖున ఉదయం 8 గంటలకు బోనాలు, రాత్రి 8 గంటలకు అమ్మవారు దీవెన బండారు ఇచ్చే కార్యక్రమం జరుగుతుందన్నారు. నోసుం గ్రామ పెద్దలు శ్రీ పెద్దమ్మ తల్లి జాతరకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గారికి శ్రీ పెద్దమ్మతల్లి దేవర జాతర ఆహ్వాన పత్రికను నో సుం గ్రామ పెద్దలు మల్కిరెడ్డి రఘురామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి , గంధం శెట్టి రమణయ్య, గంధం శెట్టి రాఘవేంద్ర చిన్న వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, పార్థసారధి రెడ్డి, కమ్మరి పెద్దన్న గ్రామ నాయకులు అందజేశారు.

# అక్షరయోధుడు .. సామాజిక విప్లవ సూర్యుడు



కర్నూల్ జిల్లా, ఆలూరు ఏప్రిల్ 11:-సామాజిక న్యాయం కోసం అచంచలంగా పోరాడిన మహనీయుడు, బాలికలకు విద్యా హక్కు కల్పించిన ప్రథమ యోధుడు మహాత్మా జ్యోతిబా ఫూలే గారి 200వ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు. నివాళులు అర్పించిన శ్రీమతి వైకుంఠం జ్యోతి గారు (ఆలూరు టిడిపి ఇంచార్జ్) శ్రీ వైకుంఠం శివ ప్రసాద్ గారు (స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ)నేడు ఆలూరులో నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మా జ్యోతిబా ఫూలే గారి చిత్రపటానికి పూలమాలలు వేసి, వారి ఆశయాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# బాలిక హత్యకు పాల్పడ్డ నిందితుడు వెంకటేష్ పై పోలీసుల కాల్పులు

కడప,ఖాజీపేట లోని అగ్రహారం కిందిన కీర్తన అనే విద్యార్థిని గొంతు కోసిన వెంకటేష్ ను పోలీసులు వేరే ప్రదేశంకు తీసుకెళ్తుండగా.. పోలీసులపై వెంకటేష్ దాడికి పాల్పడిన నేపథ్యంలో మైదుకూరు బద్వేల్ ప్రధాన రహదారిలోని బసాపురం చెక్ పోస్ట్ వద్ద నిందితుడు వెంకటేష్ పై పోలీసులు కాల్పులు జరిపినట్లు సమాచారం.. ఈ ఘటనలో పోలీసులకు కొందరికి గాయాలైన నేపథ్యంలో మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు.. ఈ ఘటనపై పూర్తి సమాచారం పోలీసుల వర్గాల నుండి వెల్లడి కావాల్సి ఉంది. నిందితుడు రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**